విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 16, అక్టోబరు 2024

అన్నమయ్య జిల్లా ఇంచార్జ్‌గా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

విశాలాంధ్ర, బనగానపల్లె: అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జిగా బనగాన పల్లె నియోజకవర్గం ఎమ్మెల్యే, ఆర్అండ్‌బి, పెట్టుబడులు మౌలిక వసతుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి నియమించబడ్డారు. మంగళవారం కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జిల్లాల ఇన్‌చార్జిలను ప్రకటించారు. ఇందులో భాగంగా ఆర్అండ్‌బి శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నమయ్య జిల్లాకు ఇన్చార్జిగా నియమించబడ్డారు. గతంలో టిడిపి పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నెల్లూరు ఒంగోలు జిల్లాల కోఆర్డినేటర్‌గా, తెలుగుదేశం పార్టీ యాక్షన్ కమిటీ మెంబర్‌గా సమర్థవం తంగా విధులు నిర్వహించారు.

దేశ భవిష్యత్తుకు నారీశక్తి అవసరం : కలెక్టర్

విశాలాంధ్ర - నంద్యాల

దేశ భవిష్యత్తు కోసం నారీ శక్తి అవసరత ఎంతైనా ఉందని, ఆ దిశలో పయనించేందుకు మొక్కవోని దీక్షతో వచ్చిన అవకాశాలను అంది పుచ్చుకొని దృఢ సంకల్పంతో ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి విద్యార్థిను లకు ఉద్బోధించారు. మంగళవారం కలెక్టరేట్లోని సెంటినరీ హాల్లో అంతర్జాతీయ బాలికల దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ జి. రాజకుమారి ముఖ్యఅతిథిగా పాల్గొంటూ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి లీలావతి, వరల్డ్ విజన్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి తిరుపతిరావు, గర్ల్స్ డెవలప్మెంట్ ఆఫీసర్ సువర్చల, డిప్యూటీ డిఎంహెచ్వో శారదాబాయి, అడ్వకేట్ హిమబిందు, మదర్ సొసైటీ ఫౌండర్ రామారావు, సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థినిలలో సృజనాత్మకత ఆలోచనలు రేకెత్తించి ఏదైనా సాధించగలమన్న స్ఫూర్తిని తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఈ ఏడాది "దేశ భవిష్యత్తు కోసం బాలికల దృష్టి" అనే థీమ్ తో బాలికలు తమ లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఎన్ని సవాళ్ళు ఎదురైనప్పటికీ అకుంఠిత దీక్షతో ముందుకు వెళ్లి సాధించే తపన ఉండాలన్నారు. అకడమిక్ విద్యతో పాటు బాలికల్లో దాగి ఉన్న నిద్రాణమైన శక్తిని వెలికి తీసి ప్రోత్సహించే బాధ్యత తల్లిదండ్రులు, గురువులదేనని అన్నారు. విద్యార్థులు ఉత్తీర్ణతతో పాటు, పోటీ పరీక్షలకు కూడా సిద్ధమై లక్ష్యాన్ని సాధించేందుకు విశేష కృషి చేయాలన్నారు. వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకొని మరింత ప్రతిభ కనబరిచేందుకు విద్యార్థి దశ నుండే ఉత్సాహంతో ముందుకెళ్లాలన్నారు. ప్రతి విషయాన్ని విశ్లేషించి తెలియని విషయాలను మొహమాట పడకుండా ప్రశ్నించి తెలుసుకుంటే జీవితంలో స్థిరపడడానికి అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థి దశలో అనేక ఆకర్షణీయమైన వస్తువులపై మమకారం ఉంటుందని, స్వశక్తితో ఆ వస్తువులను సంపాదించుకొనే కష్టపడే మనస్తత్వం కలిగి ఉండాలన్నారు. వివిధ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. జ్ఞాపికలను అందజేశారు. మహిళా సాధికారతపై స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఏర్పాటుచేసిన స్టాళ్లు ఆకర్షించాయి.

పాఠశాలలు, ప్రార్థన మందిరాల దగ్గర మద్యం షాపులు ఏర్పాటు చేయరాదు

సీపీఐ జిల్లా నాయకులు ఎం.రమేష్‌బాబు

విశాలాంధ్ర, జూపాడుబంగ్లా: నియోజక వర్గంలో మద్యం దుకాణాలను పాఠశాలలు ,గుడులు,మసీదులు, ప్రార్ధన మందిరాలకి దగ్గరలో ఏర్పాటుకు అనుమతి ఇస్తే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని సీపీఐ జిల్లా నాయకులు ఎం.రమేష్‌బాబు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం నూతన మద్యం పాలసీలో భాగంగా టెండర్లు వేసిన వారికి ఇష్టం వచ్చినట్లు ఎక్కడబడితే అక్కడ అనుమతులు ఇస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. ఇప్పటికే చాలా చోట్ల షాపుల ఏర్పాటుకు టెండర్ దారులు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని తెలిసిందన్నారు. నందికొట్కూరు నియోజవర్గంలోని ఆరు మండలాల పరిధిలో ఎక్కడైనా గుడులు బడుల దగ్గర మద్యం షాపులు ఏర్పాటు చేస్తే ప్రజలకు ఇబ్బందికరంగా ఉంటుందని ఎక్సైజ్ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్ని వసతులు ఉన్నచోట మాత్రమే మద్యం షాపులకు అనుమతి ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఎక్కడికక్కడ పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నరసింహ, పుల్లయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధి.. ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే చరితారెడ్డి

విశాలాంధ్ర - గడివేముల: పల్లెల అభివృద్దే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో మంగళవారం మండలంలోని గడివేముల, చిందుకూరు గ్రామాలల్లో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజా చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ మండలం మొత్తం సీసీ రోడ్డు నిర్మాణాలకు ఉపాధి హామీ పథకం కింద 2.50 కోట్లు మంజూరయ్యాయని, గడివేముల గ్రామంలో రూ.60లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే అభివృద్ధి పనులు మొదలుపెట్టామని తెలిపారు. గత ప్రభుత్వం సర్పంచ్ నిధులన్నీ వాడుకొని సర్పంచులను డమ్మీ బొమ్మలుగా చేసి పంచాయతీలను నిర్వీర్యం చేసారన్నారు. గోకులం షెడ్లు అర్హులైన వారందరికీ మంజూరైయేట్లు చేస్తానన్నారు. మహిళలకు దీపావళి కానుకగా ఉచితంగా మూడు సిలిండర్ లు అందజేస్తామన్నారు. గడివేములకు మంత్రి బిసి జనార్దన్ రెడ్డితో మాట్లాడి బైపాస్ రోడ్డు నిర్మాణం త్వరలోనే మొదలు పెడతామన్నారు. దాదాపు మూడు టీఎంసీ నీళ్లు నిల్వ ఉండే అలగనూరు రిజర్వాయర్ దెబ్బతిన్న భాగం పునః నిర్మాణం, వెలగమాన్ ఫీడర్ కాల్వ నిర్మాణం చేస్తామన్నారు. ఈ కార్యక్రమం లో తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీఓ వాసుదేవ గుప్తా,ఈఓఆర్డీ మహీందర్ రెడ్డి,ఏపిఓ వెంకటరమణ అన్నిశాఖల అధికారులు, గడివేముల సర్పంచి రమణమ్మ, టీడీపీ మండల కన్వీనర్ దేశం సత్యనారాయణ రెడ్డి, టీడీపీ నాయకులు పంట రాంచంద్రారెడ్డి, ప్రకాష్ రెడ్డి, బిలకలగూడూరు మాజీ సర్పంచులు సుదర్శన్ రెడ్డి,రఫీక్, సుభద్రమ్మ పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి పల్లెలే పట్టుకొమ్మలు..

ఎమ్మెల్యే గిత్త జయసూర్య

విశాలాంధ్ర, మిడుతూరు-: గ్రామాల ప్రగతే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. మంగళవారం చింతలపల్లె, గ్రామంలో రూ.50 లక్షలతో మిడుతూరులో రూ.90 లక్షలతో సిమెంట్ రహదారులు, సైడ్ కాలువల నిర్మాణానికి ఎమ్మెల్యే శంస్థాపన చేశారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా సమస్య పరిష్కార వేదిక లో పాల్గొని మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు సమస్యలు వింటూ సమస్యలు పరిష్కరించేందుకు వారి నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ,డిప్యూటీ సీఎం గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. పేదవాడి ఆకలి తీర్చేందుకు కూటమి ప్రభుత్వం అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసిందని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల హామీలో భాగంగా మొదటి విడతగా 100, రెండో విడతగా 70 అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసిందని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం పంచాయతీల నిర్వీర్యం చేసిందని పంచాయతీల పెద్దపీట వేశామని చెప్పారు.

దోర్నిపాడు మండలంను అభివృద్ధి బాటలో తీర్చిదిద్దుతా..

ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ

విశాలాంధ్ర -ఆళ్లగడ్డ : దోర్నిపాడు మండలంను అభివృద్ధి బాటలో తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ పేర్కొన్నారు. మంగళవారం దొర్నిపాడు లోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అమర్నాథ్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది.. ఈ సందర్భంగా మండల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తాలూకా మొత్తంలో గత ఐదు సంవత్సరాలు కాంట్రాక్టర్లు కాంట్రాక్టులు తీసుకొని రోడ్ల పనులు చేయకుండా ఆపివేశారో వారందరికీ నేను ఒకటే చెబుతున్న పనులు చేయని చోట పనులు మొదలుపెట్టండి లేదంటే మీపై చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వం లాగా కాదు మా ప్రభుత్వం ఇది ప్రజలందరి ప్రతి ఒక్కరికి సమన్యాయం జరుగుతుందన్నారు. మండల మీటింగ్‌లో ఏ సమస్యలు అయితే చెప్పారో వాటన్నింటినీ అధికారులతో మాట్లాడి కచ్చితంగా నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. కాగా తాహసిల్దార్ పద్మజ సమావేశానికి రాకపోవడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. తాహసిల్దార్‌కి ఫోన్ చేసి ముఖ్యమైన సమావేశానికి రాకపోవడం పై ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సావిత్రి, జడ్పిటిసి శకుంతలతో పాటు ఇతర మండల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే తమ ధ్యేయమని ఎమ్మెల్యే అఖిలప్రియ అన్నారు. దొర్నిపాడులోని సొసైటీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని వినతిపత్రాలు తీసుకొని ప్రతి ఒకటి నెరవేరుస్తానని తెలిపారు. ఇది ప్రజల ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ప్రకారం అన్ని చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి సర్పంచు ఎంపీటీసీ జడ్పీటీసీలు ఎంపీపీలు అందరూ సహకరించాలని వచ్చే పథకాలు నిధులు పార్టీలకతీతంగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.అధికారులు కూడా ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.

వెలుగోడు పట్టణానికి నీటి ఇబ్బందులు

విశాలాంధ్ర-వెలుగోడు : వెలుగోడు పట్టణానికి నీటి ఇబ్బందులు ఏర్పడ్డాయి. వెలుగోడు రిజర్వాయర్‌కు నీటిని అందించే గాలేరు గేట్ల వద్ద పంపుహౌస్ మోటర్లు గాలేరు గేట్లు పూర్తిగా ఎత్తడం వల్ల ఆ నీటి ఉధృతికి వాటికి సంబంధించిన కేబుల్స్ తెగిపోవడంతో మోటారు నీటిలో పడిపోయింది. పంపు హౌస్ వద్ద రెండు మోటార్లు పనిచేస్తున్నాయి. ఒకటి నీటిలో పడిపోవడంతో, మిగతా ఒక మోటారు వల్ల పట్టణానికి, మిగతా గ్రామాలకు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని నిర్వాహకుడు తెలిపాడు. మండల పట్టణ ప్రజలు గమనించాలని అన్నారు. మరమ్మత్తులు త్వరగా పసమస్యను పరిష్కరించి మరలా యధావిధిగా నీటి సరఫరా అందిస్తామని వారు తెలిపారు.

డీ-మ్యాక్స్ అంబులెన్స్ అందుబాటులోకి

విశాలాంధ్ర-పాణ్యం : అత్యధిక నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ప్రత్యేకంగా రూపొందించిన ఇసుజు డి మ్యాక్స్ అంబులెన్స్‌ను విపనిలోకి ప్రవేశ పెట్టామని తెలపడానికి తనకెంతో సంతోషంగా ఉందని మంగళవారం సంస్థ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ తోరు కిషిమోటో పేర్కొన్నారు. 14 బెస్ట్ ఇన్ క్లాస్ లక్షణాలతో ఏఐఎస్-125 టైప్ సి అంబులెన్స్ నిర్దేశనలకు ఆటో మేటివ్ పరిశ్రమలో ఇదొక గేమ్ చేంజర్‌గా తన స్థానాన్ని బలోపేతం చేసుకుంటుందని చెప్పారు. చెన్నై ఎక్స్ షోరూం ప్రారంభ ధర 26 లక్షలు అన్నారు.

తప్పులు సవరణకు చివరి అవకాశం

విశాలాంధ్ర - వెలుగోడు: వెలుగోడు మండలంలోని అబ్దుల్లాపురం, గుంతకందాల గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం ఏవో పవన్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. రైతులు సాగుచేసిన పంట వివరాల జాబితా రైతు సేవా కేంద్రంలో ప్రదర్శించారు. ఈ పంట నమోదు లో ఏవైనా తప్పులు ఉంటే సవరణ చేసుకోవడానికి ఇది చివరి అవకాశం అని రైతులకు తెలియజేశారు.అలాగే రాబోయే రెండు రోజులు అల్పపీడన ప్రభావంతో వెలుగోడు మండలంలో భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఉత్పత్తులను యాంత్రికంగా ఆరబెట్టాలని మొక్కలకు వర్షం ఆగిన వెంటనే సూపర్ పోషకాలు ఎరువులను పిచికారి చేసుకోవాలని ఏవో తెలిపారు. వ్యవసాయవిస్తరణ సిబ్బంది అంజిత్‌కుమార్‌రెడ్డి, అప్సర్ అలీ పాల్గొన్నారు.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

విశాలాంధ్ర -ఉయ్యాలవాడ: మిరప సాగు చేసిన రైతులు మంచి దిగుబడులు సాధించాలంటే తప్పనిసరిగా సస్యరక్షణ పద్ధతులు పాటించాలని కోవెలకుంట్ల ఉద్యానవన శాఖ అధికారిణి ధరణి సూచించారు. మంగళవారం మండలంలోని ఇంజేడు, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, అల్లూరు గ్రామాల్లో రైతులు సాగుచేసిన మిరప పంటను ఆమె పరిశీలించారు. ప్రస్తుతం తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి, మిరప పంటలో నీరు నిల్వ ఉండకుండా బయటకు పంపే ఏర్పాటు చేసుకోవాలన్నారు. మొక్క ఆకులు తలలు వాలినట్టుగా గుర్తించామని నివారణకై 10 గ్రాముల యూరియా ఒక లీటర్ నీటిలో కలిపి వారానికి రెండుసార్లు పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సరళ, భారతి, శిరీష, భవానీలు పాల్గొన్నారు.

ముగిసిన వృత్తి విద్య అవగాహన

విశాలాంధ్ర. నందికొట్కూరు .. నందికొట్కూరు మండలం లోని పి.ఎమ్. శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొణిదెల గ్రామం లోనీ విద్యార్థులకు దసరా సెలవుల్లో వివిధ రకాల వృత్తి విద్యా కోర్సులపై ఒకేషనల్ ట్రైనర్ షాకీరా కల్పించిన అవగాహన కార్యక్రమం మంగళవారం ముగిసింది. నర్సింగ్, ల్యాబ్ టెక్నీషియన్, మెడికల్ స్టోర్స్, వృత్తి విద్యా కోర్సులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్ర మూర్తి మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థు లకు సెలవుల్లో తమ సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ఇంటర్న్‌షిప్ చక్కగా ఉపయోగపడిందని తెలిపారు. ఒకేషనల్ ట్రైనర్ షాకీరాని సీనియర్ ఉపాధ్యాయులు నారాయణరెడ్డి, రఫీ అహ్మద్,శ్రీనివాసరెడ్డి, ఆనందరావ్‌సిల్వియారేచల్ ఫిజికల్ డైరెక్టర్ స్వామిదాస్ అభినందించారు.

కొనసాగిన పొలం పిలుస్తోంది..

విశాలాంధ్ర-కోవెలకుంట్ల : గులదుర్తి, పొట్టిపాడు గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించామని వ్యవసాయ అధికారి నిర్మించిన తెలిపారు. ఖరీఫ్ లో సాగుచేసిన వివిధ పంటల యాజమాన్యం, పురుగులు తెగులు నివారణ, ఈ క్రాప్ పంట నమోదు, భూసార పరిరక్షణ ఆవశ్యకత, భూసార పరీక్ష పత్రాల డిస్ట్రిబ్యూషన్, కిసాన్ డ్రోన్స్ వినియోగం వివరించారు.

పల్లె పండుగతో గ్రామ స్వరాజ్యం సాధ్యం

- మంత్రి ఎన్ఎండి ఫరూక్

విశాలాంధ్ర - నంద్యాల : "పల్లె పండుగ" పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా గోస్పాడు మండలం ఎస్ నాగులవరం గ్రామంలో ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి పనులను మంత్రి ఫరూక్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎస్.నాగులవరం గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధి హామీ పథకం క్రింద రూ.10 లక్షలతో రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని గ్రామాల్లో ప్రజల మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశామని చెప్పారు. ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, టిడిపి గోస్పాడు మండల కన్వీనర్ తులసీశ్వర్ రెడ్డి, నంద్యాల మండల కన్వీనర్ విశ్వనాథ్ రెడ్డి, నరేంద్ర రెడ్డి, సుధాకర్, నాగేశ్వర్ రెడ్డి, చాబోలు ఇలియాస్, గుర్రప్ప, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన వాటర్ ట్యాంక్‌కు భూమి పూజ

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల పట్టణం శ్రీనివాస్ నగర్ పంపు హౌస్ నందు 600 కేఎల్ ఈఎల్ఎస్ఆర్ కు రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా పాల్గొని భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులతో శ్రీనివాస్ నగర్ పంప్ హౌస్ నందు కొత్తగా 600 కేఎల్ ఈఎల్ఎస్ఆర్ వాటర్ ట్యాంక్ ను కోటి 81లక్షల వ్యయంతో నిర్మించడం జరుగుతుందని, పెరుగుతున్న జనాభా రీత్యా పాత వాటర్ ట్యాంక్ సామర్థ్యం తక్కువగా ఉండడం, శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన ట్యాంకు నిర్మించుటకు ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం ఆమోదంతో భూమి పూజ చేశామన్నారు. ప్రజలందరికీ మంచినీటిని అందించాలనేదే కూటమి ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, డాక్టర్ బాబన్, కౌన్సిలర్లు తమిమ్, మున్సిపల్ సిబ్బంది, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా కలాం జయంతి వేడుకలు

విశాలాంధ్ర -చాగలమర్రి : చాగలమర్రి పట్టణం లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మాజీ రాష్ట్రపతి,మిస్సైల్ మాన్ ఆఫ్ ఇండియా అబ్దుల్ కలాం జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి హెచ్ఎం కోటయ్య ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలను పలువురు కొనియాడారు.కార్యక్రమం లో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

మిస్సైల్ మ్యాన్ కలాం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా, 11 వ మాజీ రాష్ట్రపతి భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు అపుస్మా ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. అపుస్మ ఆళ్లగడ్డ నియోజకవర్గం యూనిట్ అధ్యక్షులు అమిర్ భాష ఆధ్వర్యంలో పట్టణ సిఐ చిరంజీవి, ఎస్ఐ జయన్నలు విచ్చేసి ఆళ్లగడ్డ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సిఐ చిరంజీవి మాట్లాడుతూ ప్రపంచం గర్వించదగ్గ గొప్ప శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాం అని వారి జీవన విధానం వారి దర్శనికత ప్రజలకు స్ఫూర్తిదాయకమన్నారు.

అబ్దుల్ కలాం సేవలు మరువలేనివి

విశాలాంధ్ర ఆత్మకూరు టౌన్: భారత దేశ ముద్దుబిడ్డ మాజీ రాష్ట్రపతి, భారతరత్న అబ్దుల్ కలాం సేవలు మరువలేనివని రైతు సంఘం నాయకులు మోమిన్ మునీర్ భాష, కృషి పండ్ల తోటల సంఘం అధ్యక్షుడు బైరాపురం మహబూబ్ బాషాలు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని నంద్యాల టర్నింగ్ దగ్గర గల కృషి పండ్ల తోటల రైతు సేవా సొసైటీ కార్యాలయంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

నివాళులర్పించిన డీఎస్పీ

విశాలాంధ్ర ఆత్మకూర్ రూరల్ : ఆత్మకూరు పట్టణం శ్రీ జగద్గురు మట్టంలో క్షిపణి పితామహుడు మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని ఏపీజె అబ్దుల్ కలాం స్మారక సమితి జవహర్ నాయక్ ,శీలం శేషు, ఎంఈఓ సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డిఎస్పీ రామాంజి నాయక్ హాజరై వెంకటాపురం గ్రామానికి చెందిన తల్లిదండ్రులు లేని నిరుపేద 10వ తరగతి విద్యార్థినిలకు రియల్ ఎస్టేట్ ఆకుల సలాం సహకారంతో రూ.10వేలు అందించారు. అమలాపురం చెంచుగూడెం గిరిజన మహిళలకు చీరలు పంపిణీ చేశారు. వివిధ రంగాలలో ఉత్తమ సేవా దృక్పథం చూపిన10 మందికి సన్మానం చేశారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో

విశాలాంధ్ర - నంద్యాల : భారతరత్న, మాజీ భారత రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి ప్రపంచ విద్యార్థి దినోత్సవాన్ని పురస్కరించు కుని నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షులు నిజాముద్దీన్ అధ్యక్షతన ముగ్గురు దివ్యాంగ విద్యార్థులకు 5 వేల లు ఉపకార వేతనాలను లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ కశెట్టి చంద్రశేఖర్ సౌజన్యంతో అందజేశారు. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, కశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం జీవితం విద్యార్థు లకు స్ఫూర్తిదాయం అన్నారు. లయన్స్ క్లబ్ కార్యదర్శి శిరిగిరి రమేష్,జోన్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు కూర ప్రసాద్, సోమేశుల నాగరాజు,సీనియర్ సభ్యులు ఆంజనేయులు గుప్తా, బాల అకాడమీ రవీంద్ర పాల్గొన్నారు.

గ్రామపంచాయతీల అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర బనగానపల్లె: గ్రామ పంచాయతీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని ఎంపీడీవో వెంకట రమణ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమం ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు టంగుటూరు గ్రామంలో నిర్వహించారు. 30 లక్షల రూపాయలతో సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో శివ పుల్లారెడ్డి, రంగస్వామి రెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, చల్లా వెంకట సుబ్బారెడ్డి, వెంకటసుబ్బయ్య చంద్రశేఖర్, పంచాయతీరాజ్ ఎఈ, ఉపాధి హామీ టెక్నికల్ ఇంజనీర్ మక్బూల్ హుస్సేన్, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే పల్లెలుఅభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర జూపాడుబంగ్లా : తెదేపా ప్రభుత్వంతోనే పల్లెలు అభివృద్ధి గ్రామీణ పల్లెలు అభివృద్ధి సాధ్యమని గ్రామ మాజీ సర్పంచ్ టిడిపి మండల కన్వీనర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని తుడిచెర్ల గ్రామంలో పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. వైసీపీ పాలనతో ఐదేళ్లపాటు గ్రామీణ ప్రాంతాలలో కనీస మౌలిక సదుపాయాలకు నోచుకుక గ్రామాలు అధ్వాన పరిస్థితికి చేరుకుందని అన్నారు. అనంతరం గ్రామంలో రూ.45 లక్షలతో చేపట్టబోయే పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ ఎంపీడీవో గోపికృష్ణ, ఏపీవో గౌరీ భాయ్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ బషీర్, పాల్గొన్నారు.

జగనన్న కాలనీకి ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర. నందికొట్కూరు : నందికొట్కూరులోని కొణిదెల రోడ్డులో ఉన్న జగనన్న కాలనీకి ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్‌ను ఏర్పాటు చేయాలని సిపిఐ ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపో సిఐ సరోజమ్మకి ఆర్టీసీ సిబ్బంది రామస్వామికి వినతిపత్రం ఇచ్చారు. నందికొట్కూరు పట్టణంలో ఇల్లు లేని పేదలందరికీ గత ప్రభుత్వంలో వైయస్ జగనన్న కాలనీలో 1500 ఇల్లు ఇచ్చారని, లబ్ధిదారులు ప్రభుత్వ సహకారంతోపాటు ప్రైవేటు అప్పులు తెచ్చుకొని సొంతంగా ఇల్లు నిర్మించుకొని నివాసిస్తున్నారన్నారు. పట్టణంలోకి రావడానికి జగనన్న కాలనీ దూరం ఉండటంతో ఆర్టీసీ బస్సులు ఆపకపోవడంతో ప్రైవేట్ వాహనాల్లో కాలినడకన పనుల కోసం పట్టణానికి వస్తున్నారన్నారు. పట్టణం నుంచి వెలుగు ఆఫీస్ వరకు పది రూపాయలు ఛార్జి వసూలు చేయాలని నిబంధనలు ఉన్నప్పటికీ బిజినవేముల అంచె దగ్గరకి టికెట్టు రూ.20లు వసూలు చేస్తున్నారని విమర్శించారు. తక్షణమే ఆర్టీసీ డిఎం జోక్యం చేసుకొని జగనన్న కాలనీ దగ్గర రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేసి బస్సుచార్జి 10 తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు కాటేపోగు స్వమన్న స్వాములు నాయుడు, షేక్షావలి, మా భాష ,వెంకటరమణ, హుస్సేన్, జనార్ధన్ పాల్గొన్నారు.

ఆర్థిక మంత్రి కేశవ్‌ను కలిసిన భూమా జగద్విఖ్యాత్ రెడ్డి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : విజయవాడలోని పార్టీ కార్యాలయంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ను ఆళ్లగడ్డ తాలూకా టిడిపి యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పయ్యావుల కేశవ్ ను నంద్యాల జిల్లా ఇన్చార్జ్ మంత్రిగా నియమించిన సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆళ్లగడ్డ నియోజకవర్గం అభివృద్ధి గురించి జగత్ విఖ్యాత్ రెడ్డి వివరించారు.

పారిశుధ్యం లోపిస్తే చర్యలు

విశాలాంధ్ర-చాగలమర్రి : గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ మంజులవాణి సిబ్బందిని హెచ్చరించారు. మంగళవారం మండలంలోని గొడెగనూరు గ్రామంను సందర్శించి పారిశుధ్యం లోపంపై అసహనం వ్యక్తం చేశారు. సచివాలయ సమీపంలో మురికి నీటిలో మంచి నీటి కొళాయి ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మురికి నీటిని తొలగించి కుళాయిని పునరుద్ధరించాలని పంచాఅతీ కార్యదర్శి రాజశేఖర్‌ను ఆదేశించారు. మంచినీటి ట్యాంక్‌ను పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రజలు నీటిని వృధాగా రోడ్లపై వేయొద్దన్నారు.

గ్రామాలు అభివృద్ధి బాట

విశాలాంధ్ర, కొలిమిగుండ్ల : మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నంద్యాల ప్రసాద్ మంగళవారం మదనంతపురం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం గ్రామాలలో మౌలిక వసతుల కల్పనతో పాటు సంక్షేమానికి కృషి చేస్తున్నదన్నారు. టిడిపి నాయకులు జయలక్ష్మి రెడ్డి, వివేక్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర-వెలుగోడు : పంచాయతీ నిధులతో గ్రామాల అభివృద్ధి చేపడుతామని ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి తెలిపారు. వెలుగోడు మండలంలోని రేగడ గూడూరులో 9.4 లక్షలతో సిమెంటు రోడ్డుకు భూమి పూజ చేశారు.

విశాలాంధ్ర, నందికొట్కూరు : వడ్డేమాన్ గ్రామంలో గ్రామ సర్పంచ్ రామచంద్రుడు ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా నియోజవర్గం ఎమ్మెల్యే గిత్త జయ సూర్య పాల్గొని గ్రామ టిడిపి నాయకులు సత్యం రెడ్డితో కలిసి సిసి రోడ్డు పనులకు భూమి పూజ చేశారు.

ప్రొఫెసర్ సాయిబాబాకి ఘనంగా నివాళి : సీపీఐ

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : అనారోగ్యంతో మృతి చెందిన పౌర హక్కుల నేత ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సాయిబాబాకి సీపీఐ కర్నూల్ నగర సమితి ఆధ్వర్యంలో సీఆర్ భవన్‌లో పూల మాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. మంగళవారం సీపీఐ కర్నూల్ నగర సహాయ కార్యదర్శి మహేష్ అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి మొదటగా సాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసి నివ్వాళి అర్పించారు. రామాంజనేయులు, రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రొఫెసర్ సాయిబాబా తను నమ్మిన సిద్ధాంతం కోసం తుది వరకు నిలిచారని కొనియాడారు. సాయిబాబాను 9 సంవత్సరాలు పైబడి మోడీ ప్రభుత్వం జైల్లో నిర్బంధించి ఆయనకు నరకం చూపించిందన్నారు. జైల్లోనే ఆయన ఆరోగ్యం క్షీణించినప్పటికీ కనీసం పెరొల్ బెయిల్ కూడా ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించిందని మండిపడ్డారు ప్రొఫెసర్ సాయిబాబా మానవ హక్కుల పరిరక్షణ కోసం అంగవైకల్యంలో ఉన్నప్పటికీ పరితపించే వాడన్నారు. జైల్లో ఖైదీలకు కులం ప్రతిపాదికన విధులు కేటాయిస్తున్నారన్న విషయాన్ని మొట్టమొదటగా లేవనెత్తిన వ్యక్తి సాయిబాబా అన్నారు. ప్రొఫెసర్ సాయిబాబాని కేంద్ర ప్రభుత్వం అధికార బలంతో జైల్లో పెట్టగలిగింది కానీ 9 సంవత్సరాలు గడిచిన ఎలాంటి నేర నిరూపణ చేయలేకపోవడంతో బాంబే హైకోర్టు నిర్దోషిగా ప్రకటించిందన్నారు. ఆయన ఆరోగ్యం క్షీణించడం వల్ల బయటికి వచ్చిన అతికొద్ది కాలంలోనే మరణించాడన్నారు. ఇది కచ్చితంగా కేంద్ర ప్రభుత్వ హత్య అని మండిపడ్డారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గిడ్డమ్మ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న, నగర నాయకులు చంటి, నగర కార్యవర్గ సభ్యులు కుమారు, నగరనాయకులు కుమారు, రాముడు పాల్గొన్నారు.

భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టండి

హంద్రీ, తుంగభద్ర నదీ పరీవాహక ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అన్ని విధాలా ముందస్తు చర్యలతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని జొహరాపురం బ్రిడ్జి మీదుగా ప్రవహి స్తున్న హంద్రీ నదిని, అనంతరం పాతబస్తీలోని రాఘవేంద్ర స్వామి మఠం వెనుక ఉన్న తుంగభద్ర నదీ పరీవాహక ప్రాంతాన్ని పరిశీలించారు.. ఒకవేళ భారీ వర్షాలు వస్తే ఎన్ని క్యూసెక్కుల మేర నీరు వచ్చే అవకాశం ఉంటుంది, ఏఏ ప్రాంతాలు ప్రభావితం అవుతాయి అన్న వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. 5 లక్షల క్యూసెక్కుల నీరు వస్తే కొన్ని ప్రాంతాలు ముంపుకు గురయ్యే అవకాశం ఉందని, ప్రస్తుతం 60 వేల క్యూసెక్కులు మాత్రమే ఉందని అధికారులు తెలిపారు. మ్యాపు ద్వారా ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం జిల్లాలో అల్పపీడనం ప్రభావం అంతగా లేదని, అయినప్పటికీ అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని ఇరిగేషన్, మున్సిపల్ కమిషనర్, కర్నూలు ఆర్డీఓలను ఆదేశించారు. హంద్రీ నదీ చుట్టూ ఉన్న జంగిల్ క్లియరెన్స్ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట కర్నూలు మున్సిపల్ కమీషనర్ ఎస్.రవీంద్రబాబు, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, కర్నూలు అర్బన్ తహశీల్దార్ వెంకట లక్ష్మి పాల్గొన్నారు.

'పది'లో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణులు కావాలి

విశాలాంధ్ర-కర్నూలు సిటీ : జిల్లాలో ఈ విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణులు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని దామోదరం సంజీవయ్య స్మారక మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో సంభాషించారు. ముందుగా పాఠశాల ఆవరణలోని బాల బాలికలతో భోజనం చేశారా ? మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నారా లేదా అని ప్రశ్నించారు. మెనూ ప్రకారం భోజనం అందజేస్తున్నారని పిల్లలు సమాధానమిచ్చారు.. పాఠశాలలో లైబ్రరీ ఉందా అని ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పదవ తరగతి చదివే విద్యార్థులతో పాటు ఫెయిల్ అయిన వారు కూడా పాస్ అయ్యేలా ఉత్తమ ఉపాధ్యాయులతో పాఠ్యాంశాలు బోధించేందుకు వర్చువల్ పద్ధతిలో ఏర్పాట్లు చేయాలని డిఈఓను ఆదేశించారు. ప్రతి విద్యార్థి పదవ తరగతి పరీక్షల్లో కచ్చితంగా పాస్ అయ్యేలా బోధన ఉండాలన్నారు. పత్యేకంగా షెడ్యూల్ రూపొందించి అమలు చేయాన్నారు. మున్సిపల్ కమీషనర్ ఎస్.రవీంద్రబాబు, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, డిఈఓ శామ్యూల్, కర్నూల్ అర్బన్ తహసీల్దార్‌వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నగరంలో శివారు ప్రాంతాల ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు అన్నారు. మంగళవారం 19వ వార్డు జోహరపురం బీడీ కార్మికుల కాలనీలో కమిషనర్ అధికారులతో కలిసి పర్యటించారు. తమ కాలనీలో మురుగు కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నామని, వర్షాలు కురిస్తే రహదారులు అధ్వానంగా తయారవుతాయని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కమిషనర్ వర్షాలకు అధ్వానమవుతున్న రహదారులపై తక్షణమే తాత్కాలిక నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని, మురుగుకాల్వల నిర్మాణాలకు ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈ శేషసాయి, ఏఈ ప్రవీణ్ కుమార్ రెడ్డి, పారిశుధ్య తనిఖీదారుడు ఆర్.రాజు, కాలనీ నాయకులు పాల్గొన్నారు.

అప్పులు తప్పులను సరిదిద్ది పాలనా అందిస్తున్నాం

- ఎమ్మెల్యే బివిజే

విశాలాంధ్ర, నందవరం : వైసిపి ఐదేళ్ల పాలనలో చేసిన అప్పులు, తప్పులను సరిదిద్ది కూటమి ప్రభుత్వం అభివృద్ధితో కూడిన సంక్షేమాన్ని అందిస్తుందని ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర రెడ్డి అన్నారు. మంగళవారం మాచాపురం గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, నందవరం మండలం అభివృద్ధికి రూ.6కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామని, రెండవ విడుతలో మరో రూ. 4కోట్లతో అభివృద్ధి పనులు చేస్తామన్నారు. మాచాపురంలో రూ.2.20 లక్షలతో మినీ గోకులానికి శంకుస్థాపన చేశామని, అందులో 10 శాతం రైతు కట్టాలన్నారు. ఎన్నికల ముందు మాట ఇచ్చామని రూ. 10లక్షలు సిసి రోడ్డు, డ్రైనేజీ వేస్తామని, జల్ జీవన్ మిషన్ రూ. 40లక్షలు పైప్‌లైన్లు, 480 కొళాయిలు ఉచితంగా ఇస్తామన్నారు. పశువుల ఉచిత మెగా క్యాంప్, ఉచిత మందులు అందజేశారు, గురురాఘవేంద్ర ప్రాజెక్టు ద్వారా మాచాపురం సాగునీరు అందంచాలని తమ తండ్రి బివి మోహన్‌రెడ్డి కోరికను ప్రతి సంవత్సరం తీరుస్తున్నామన్నారు. అలాగే వాటి రిపేర్లలకే కూడా జగన్ సర్కార్ రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. గత 5 ఏళ్లల్లో వైకాపా ఎమ్మెల్యే వచ్చి ఒక్కరినైనా కూడా పాలకరించారా అని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి ఇంటింటికి తిరిగి సమస్యలను తెలుసుకుంటూన్నామన్నారు.

పల్లెల ప్రగతి ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర ఆస్పరి : పల్లెల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఆలూరు టిడిపి ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని బిణిగేరి, జొహరాపురం గ్రామాల్లో గోకులం షెడ్డు, సీసీ రోడ్డు నిర్మాణాలకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వీరభద్ర గౌడ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీలు అబివృద్ధి చెందినప్పుడే ప్రగతి సాధ్యమన్నారు. అందుకోసమే డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సుదుద్దేశంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో రోడ్డు రవాణా మెరుగపరచేందుకు సీసీ రోడ్డు నిర్మాణాలు చేపట్టినట్టు చెప్పారు. మండలంలో త్రాగునీటి సమస్య తీవ్రత తన దృష్టికి వచ్చిందని యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడతామన్నారు. నియోజకవర్గ సస్యశ్యామలానికై వేదావతి ప్రాజెక్టును 8 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ పరమారెడ్డి, ప్రధాన కార్యదర్శి శేషాద్రి నాయుడు, బిజెపి తాలూకా ఇన్చార్జి వెంకటరాముడు, మాజీ కన్వీనర్‌లు శ్రీనివాసులు గౌడ్,తిమ్మన్న, మాజీ చైర్మన్‌లు సాలీ సాహెబ్, మల్లికార్జున రెడ్డి, బసవరాజు పాల్గొన్నారు.

పెద్దమర్రివీడులో అభివృద్ధి పనులు ప్రారంభం

విశాలాంధ్ర గోనెగండ్ల : మండల పరిధిలోని పెద్దమర్రివీడు గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద 15 లక్షలు నిధులు మంజూరు కాగా ఎంపీడీవో మణి మంజీరా ,పీఆర్ ఏఈ శంకర్, టీడీపీ మండల కన్వీనర్ నజీర్ సాహెబ్ కలసి సిసి రోడ్డుకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పల్లె నిద్ర కార్యక్రమంలో నాలుగు రోజులు ఇక్కడే బస చేసి,గ్రామంలో ఉన్న సమస్యలను తెలుసుకున్నామని గెలిచిన నాలుగు నెలలలోపు ఇక్కడ సిసి రోడ్డు మంజూరు కావడంపై ఆటో డ్రైవర్లు, ప్రజలు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పెద్దమర్రివీడు గ్రామ టిడిపి నాయకులు మాదిగ నాగరాజు, మల్లేసు, ప్రభుదాసు, రాముడు, హనుమన్న, యేసోపు,శ్రీరాములు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

తుగ్గలి, విశాలాంధ్ర: మండలంలోని గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ఒక టీడీపీతోనే సాధ్యమని టిడిపి నాయకులు ముక్కెళ్ల రామచంద్ర మారెళ్ళ వెంకట రాముడు అన్నారు. మంగళవారం ముక్కెళ్ల, మారెళ్ళ, బొందిమడుగుల, రాంపల్లి గ్రామాలలో పల్లె పండుగ పంచాయతీ వాత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. సిసి రోడ్లు డ్రైనేజీ కాలువలకు భూమి పూజ చేశారు. గత ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి నోచుకోకపోగా గ్రామపంచాయతీ నిధులను నిర్వీర్యం చేశారన్నారు. కానీ ప్రతి గ్రామంలో గతంలోనైనా ప్రస్తుత తెలుగుదేశం పార్టీ హయాంలోనే అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి శ్రీహరి ఏపీఓ హేమ సుందర్ టి.ఎ, ఎఫ్.ఎ లు టీడీపీ నాయకులు బొజ్జన్న,మునెప్ప, ధ్రువమూర్తి, కార్యకర్తలు పాల్గొన్నారు.

17న అంతర్ రాష్ట్ర కబడ్డీ పోటీలు

విశాలాంధ్ర, క్రిష్ణగిరి. ఈనెల 17న వాల్మీకి మహర్షి జయంతి పురస్కరించుకుని కోయిలకొండ గ్రామంలో అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు మంగళవారం తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి డిప్యూటీ తాసిల్దార్ దాత తలారిజయరాముడు రూ.30వేలు, రెండో బహుమతి దాత బైటిగేరి హరి, చాపలరాజు, గొట్టికె పెద్దయ్య రూ.20వేలు, మూడో బహుమతి దాత తొగర్చేడు రాముడు, పెద్ద మాణిక్యం రూ.10వేలు, నాలుగో బహుమతి దాత ఈతకాయల రాముడు రూ.5 వేలు ప్రకటించారన్నారు. 17వ తేదీ ఉదయం 10 గంటలకు 500 రూపాయలు ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

17న లోక కళ్యాణార్థం ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర, ఆదోని రూరల్: పట్టణంలోని సంతపేటలో వెలసిన శ్రీకోట వీరభద్ర స్వామి దేవాలయంలో ఈనెల 17న శ్రీమహా రుద్ర హెూమం,శ్రీమహా ప్రత్యంగిరా హెూమము లోక కళ్యాణార్థం ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని ఆదోని డివిజన్ అర్చక సమాఖ్య గౌరవ అధ్యక్షులు అల్కూరి మఠం మహర్షి విజయ్‌కుమార్ స్వామి మంగళవారం మీడియాకు తెలియజేశారు. ముఖ్య అతిథులుగా కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు,ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి వాల్మీకి, టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి మీనాక్షి నాయుడు,జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లప్పలను ఆహ్వానించామన్నారు. కాగా ఆలయానికి అల్కూరి మఠం మహర్షి విజయ్ కుమార్ స్వామితో పాటు కుటుంబ సభ్యులు అలుకూరి మఠం మహర్షి గిరిజావాణి, వీర ప్రకాశ, నీలకంఠ, సుధామణి,లతా 5ఫ్యాన్లు,5ఎల్ఈడి బల్బులను అందజేశారు.

సేంద్రీయ సాగుతో అధిక దిగుబడి

విశాలాంధ్ర. సిబెళగల్ : రైతులు సేంద్రియ వ్యవసాయాన్ని చేపట్టి తక్కువ ఖర్చుతో అధిక ఆదాయాన్ని, నాణ్యమైన లాభసాటి దిగుబడులు పొందవచ్చు అని మండల వ్యవసాయ అధికారి జి.మల్లేష్ కుమార్ అన్నారు. మంగళవారం కొండాపురం, ముడుమాల గ్రామాల రైతు సేవ కేంద్రాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వేసవి దుక్కులు చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు క్లుప్తంగా తెలియజేశారు. విఏఎచ్ఎలు,రాజ శేఖర్, నాగన్న, ఎంపీఈఓలు, వెంకటేష్, భాస్కర్ పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర ఆస్పరి : మండల పరిధిలోనే హలిగేర గ్రామంలో కరివేముల లక్ష్మన్న(44) సోమవారం అర్ధరాత్రి ఇంటి ముందు ఉన్న వేప చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని మంగళవారం సీఐ మస్తాన్ వలి తెలిపారు. కరివేముల లక్ష్మన్న గత కొన్ని సంవత్సరాలుగా మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోకుండా తిరుగుతూ ఉండేవాడు. ఆయనకు భార్య పార్వతమ్మ, నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అయితే కుమార్తెలు పెళ్లిళ్ల వయసు రావడంతో వారికి పెళ్లిళ్ల, వారి బాగోగురు చూడలేనే మొనని మనస్థాపానికి గురై అర్ధరాత్రి సమయంలో వారి ఇంటి ముందు ఉన్న వేప చెట్టుకు చీరతో ఉరి వేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

అసలైన నిందితులను అరెస్టు చేయాలి

ఎస్పీకి గోవిందమ్మ మొర

విశాలాంధ్ర - పెద్దకడబూరు : ఎస్పీ బిందు మాధవ్ మంగళవారం గ్రామాన్ని సందర్శించారు. బాదితురాలు దళిత గోవిందమ్మను పరామర్శించి దాడి ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. దాడి ఘటనలో తాను ఫిర్యాదులో పేర్కొన్న వారిని కేసు నుండి ఎందుకు తప్పించారని గోవిందమ్మ ఎస్పీని ప్రశ్నించారు. సభ్య సమాజం తలదించుకునేలా దళిత మహిళ అయిన నన్ను ఇంటి నుండి లాక్కొని వెళ్లి వివస్త్రను చేసి విద్యుత్ స్తంభానికి కట్టేసి దాడి చేశారని, దీనిపై ఇక్కడి పోలీసులు కేవలం రజకులను తొమ్మిది మందిపై మాత్రమే కేసు నమోదు చేసి, వారిని అరెస్టు చేసి చేతులు దులుపుకున్నారని కన్నీరు పెట్టుకున్నారు. అసలైన దోషులు గ్రామంలోనే యథేచ్ఛగా తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సంఘాల నాయకులు రామతీర్థం అమ్రేష్, లక్ష్మీనారాయణ, సామేలు, మాల నరసన్న, పందికోన ఈరన్న, చిన్న ప్రసాద్ బతుకమ్మ, సామేలు, ఏసేపు, ముక్కరన్న, అల్లప్ప ఎస్పీతో మాట్లాడారు. దాడి వెనుక ఉన్న అసలైన దోషులను అరెస్టు చేసినప్పుడే గోవిందమ్మకు న్యాయం జరుగుతుందని తెలిపారు. స్పందించిన ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ కోర్టులో జడ్జి ముందు గోవిందమ్మ మరోసారి తనపై జరిగిన దాడి గురించి వాంగ్మూలం ఇవ్వాలని, తద్వారా జడ్జి ఆదేశాల మేరకు దాడి వెనుక ఉన్న దోషులపై తదుపరి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీ ఉపేంద్ర బాబు, సీఐలు విక్రమ్ సింహా, మంజునాథ్, మల్లప్ప, ఎస్ఐలు నిరంజన్ రెడ్డి, మహేష్ కుమార్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం, ఆటో సీజ్

విశాలాంధ్ర-ఆదోని క్రైమ్ : ఆటో సీట్ల కింద కర్ణాటక మద్యాన్ని తీసుకొచ్చి పట్టణంలో విక్రయిస్తున్న ఆటో డ్రైవర్ అలిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామని, 14 బాక్సుల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకొని ఆటోను సీజ్ చేశామని ఒకటో పట్టణ సీఐ శ్రీరామ్ తెలిపారు. సోమవారం అర్ధరాత్రి నిందితుడిని సిరుగుప్ప చెక్ పోస్టు వద్ద పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారని చెప్పారు.

సమైక్య భవనానికి స్థలం కేటాయించాలి

విశాలాంధ్ర, కల్లూరు మండల సమైక్య భవనానికి శాశ్వత స్థలం కేటాయించి మహిళలను అన్ని విధాల ఆదుకోవాలని మంగళవారం తడకనపల్లి తదితర గ్రామాలకు చెందిన పొదుపు మహిళలు ఏటీఎం పుణ్యవతి ఆధ్వర్యంలో సీసీలు మండల సమైక్య సభ్యురాలు ఎమ్మెల్యే చరిత రెడ్డిని కోరారు. దశాబ్దాలుగా మండల సమైక్యకు సొంత భవనం లేకపోవడంతో అద్దె భవనంలో ఇబ్బందులు పడుతున్నామని స్థలం కేటాయించి మండలంలోని మహిళలను ఆదుకోవాలని కోరారు స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ తాసిల్దార్ దృష్టికి తీసుకెళ్లి స్థలం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో అవసరం

విశాలాంధ్ర, కోడుమూరు : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించి,ఆరోగ్యంగా జీవించాలని ఎంపిహెచ్ఈఓ నరసప్ప అన్నారు. మంగళవారం కోడుమూరు బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కో-లోకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆదేశాల మేరకు ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం నిర్వహించారు. ఎంపిహెచ్ఈఓ నరసప్ప మాట్లాడుతూ చేతులు పరిశుభ్రంగా ఉన్నట్లయితే శ్వాసకోశ వ్యాధులైన జలుబు, దగ్గు, నిమోనియా, క్షయ, జీర్ణకోశ వ్యాధులైన టైఫాయిడ్, అతిసారా, డయేరియా, డీసెంట్రీ, నులి పురుగుల నివారణ చేయవచ్చునని తెలిపారు. అనంతరం ఆప్తాలమిక్ ఆఫీసర్ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో దాదాపు 320 మందికి దృష్టి లోపము, కంటి సమస్యలు ఉన్నవారికి పరీక్షలు నిర్వహించి, అందులో 11మందికి కంటి అద్దాలు అవసరం ఉందని నిర్ధారించారు. వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తామని, మరో ఇద్దరిని కర్నూలు కంటి ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్ చేశారు.

ఉద్యమాలతోనే వర్గీకరణ సాధ్యం

విశాలాంధ్ర-పత్తికొండ: ఎమ్మార్పీఎస్ ఉద్యమంతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమవుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దండు కృష్ణ మాదిగ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి జిల్లా కార్యవర్గ సమావేశం ఎమ్.ఎస్.పి జిల్లా అధ్యక్షులు సుభాష్ చంద్ర మాదిగ అధ్యక్షత నిర్వహించగా ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంఆర్పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దండు రామకృష్ణ, ఎమ్మార్పీ జిల్లా అధ్యక్షులు రెడ్డిపోగు భాస్కర్ లు హాజరై మాట్లాడారు. దేశంలో మాదిగలు వెనకబడి సమయంలో మందా కృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని ఒక మారుమూల ప్రాంతంలో ఉద్భతం చేసి ప్రతి గ్రామంలో నేను మాదిగను అని చెప్పుకొనే గొప్ప స్థాయికి ఎదిగామని అన్నారు. అత్యున్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టు ఆయా రాష్ట్రా ప్రభుత్వాలు నిర్ణయం తీసుకొని ఏబిసిడి వర్గీకరణ చేయవచ్చని తీర్పు ఇచ్చిందన్నారు. తీర్పును రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల పోరాటాలు పెద్దఎత్తున చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఎస్పి పత్తికొండ మండల అధ్యక్షులు ముత్యాల మనోహర్. జే.రవికుమార్. మనోజ్,సూరి పాల్గొన్నారు

ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

విశాలాంధ్ర ఆస్పరి : నవంబర్ 5,6 తేదీల్లో ఆదోని పట్టణంలో జరిగే ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శరత్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శరత్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని భ్రష్టు పట్టించాయని విమర్శించారు. నూతన విద్యా విధానం పేరుతో విద్యా కాషాయకరణ, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ కు తెరలేపిందని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోధన, బోధనేతర పోస్టులు అనేకంగా ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేయడంలో గత ప్రభుత్వం విఫలమైందని అన్నారు. జూనియర్ కళాశాలలో మౌళిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ జిల్లా మహాసభల్లో చర్చించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు వేదికగా మారుతున్నాయని, ఈ మహాసభలను విద్యార్థులు, మేధావులు సహకరించి పాల్గొని, విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం కళాశాల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కళాశాల అధ్యక్షుడిగా రంగస్వామి, ఉపాధ్యక్షులుగా జగదీష్, శశికాంత్, ప్రధాన కార్యదర్శిగా రెహమాన్, సహాయ కార్యదర్శులుగా వినోద్, రవితేజ, కోశాధికారిగా వీరేష్ లతోపాటు, గర్ల్స్ కన్వీనర్ గా లావణ్య, కో కన్వీనర్లుగా మమత అశ్వినిను ఎన్నుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఈశ్వర్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి రమేష్, ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు రాజు,అనిల్, నాగముని, నల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

51 ఏట్లకు ఇనుప గొలుసును తెంచిన గొరవయ్య

విశాలాంధ్ర, హొళగుంద: నేరనికి దేవరగట్టులో మంగళవారం సింహాసన గుడి ఆవరణలో బల్లూరు గోర వయ్య 51 ఏట్ల ఇనుప గొలుసును తెంచారు. బన్నీ ఉత్సవంలో గొలుసు తెంపే కార్యక్రమం ఎంతో విశిష్టతతో కూడుకున్నది గొలుసు తెంపే కార్యక్రమానికి చూడడానికి దూర ప్రాంతాల నుండి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. వందలాదిమందిగో రవయ్యలు భక్తి పరవశంతో సింహాసన గుడి ముందు నృత్యం చేశారు. అనాది సంప్రదాయంగా వస్తున్న గొలుసు తెంపే కార్యక్రమాన్ని ప్రజలు ఎంతో ఆసక్తిగా తిలకించారు ఏడాది రెండు మూడు లేక అధిక ఏట్లకు ఇనుప గొలుసును తెంపుతుండగ ఈసారి 50 ఒక్కసారికి ఇనుప గొలుసు తెంచడంతో భక్తుల హర్షధ్వనులు మిన్నంటాయి. బల్లూరు గోరా వయ్య గొలుసు తెంపడానికి ఎంత ప్రయత్నించినా కడకు 51 ఏట్లకు ఇనుప గొలుసు తెంచారు. గోరవయ్యకు భక్తులు పూలహారాలు వేసి పసుపు బండారాన్ని చెల్లి పూజలు చేశారు. దేవరగట్టు పరిసర ప్రాంతమంతా భక్తుల సందడితో మారింది. అలాగే గొరవయ్యలు భక్తి పరవశంతో నృత్యం చేస్తూ తిరిగారు. మహిళా భక్తులు గోరవయ్యలకు పసుపు బండారాన్ని అంటించి నమస్కరించారు. దేవరగట్టు బంది ఉత్సవంలో ఇనుప గొలుసు తెంపే కార్యక్రమం ఎంతో గొప్ప దిగా భక్తులు అభివర్ణించారు. భక్తులకు సింహాసన గుడి ఆలయ ఆవరణమంతా కీటకిట ఆడింది

పల్లెలు ప్రగతికి ముఖ్యమంత్రి పెద్దపీట

విశాలాంధ్ర కృష్ణగిరి. పల్లెలను ప్రగతి పథంలో నడిపించడమే తెదేపా ప్రభుత్వ ధ్యేయమని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. మంగళవారం గోకులపాడు, రామకృష్ణాపురం, తొగర్చేడు, ఎరుకల చెరువు గ్రామాలలో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా రూ.60 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. శ్యామ్ బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నాడని కొనియాడారు. గత వైయస్సార్ ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో అభివృద్ధిని గాలికి వదిలేసారని ఆయన విమర్శించారు. పత్తికొండ నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి, మండల ప్రత్యేక అధికారి వెంకట్ లక్ష్మమ్మ, టిడిపి నాయకులు ఆలంకొండ నబి సాహెబ్, ఎంపీడీవో మోహన్ కుమార్, పంచాయతీ రాజ్ ఏఈ జాకీర్ హుస్సేన్, ఏపీవో నాగ సులోచన, సర్పంచ్ రామాంజనేయులు, శివరాముడు, ఎల్.వి ప్రసాద్, గురుస్వామి, రామాంజనేయులు, దామోదర్ నాయుడు, ప్రవీణ్ కుమార్, టిడిపి పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం

కర్నూలు నగరంలో..

తుంబలబీడు పాఠశాలలో

కౌతాళంలో..

విశాలాంధ్ర-కర్నూలు : దేశ సౌభాగ్యం కోసం, శాస్త్రా సాంకేతిక రంగం అభివృద్ధి కోసం కృషి చేసిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళ కార్యదర్శి రాయలసీమ శకుంతల అన్నారు. అబ్దుల్ కలాం 102వ జయంతి పురస్కరించుకొని అశోక్ నగర్‌లోని పట్టణ మహిళా వసతి గృహంలో మంగళవారం రాయలసీమ శకుంతల కలాం చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళ్లు అర్పించారు. అబ్దుల్ కలాం మంచి మేధావి, నీతి, నిజాయితీకి మారు పేరు, గొప్ప రాజనీతిజ్ఞుడు, అట్టడుగు నుండి దేశ రాష్ట్రపతిగా ఎన్నికై దేశానికి మార్గదర్శకుడిగా ఎదిగాడని సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ లతాశ్రీ, నిరాశ్రయులు పాల్గొన్నారు.

మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా

విశాలాంధ్ర..ఆలూరు : డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని తుంబలబీడు ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ. విజయ్ కుమార్, "మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా"గా భారత దేశాన్ని ప్రపంచ దేశాలకు సాటి లేనిదిగా చేసిన కలాం సేవలు చిరస్మరణీయమని అన్నారు. తుది శ్వాస విడిచే వరకు ఎంతో మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. ఉపాధ్యాయులు రమణారెడ్డి, నాగరాజు, విజయ్ పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ వ్యక్తి

విశాలాంధ్ర కర్నూల్ ఎడ్యుకేషన్.. స్థానిక బి-క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపల్ డాక్టర్ యస్.నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో జిల్లా వృత్తి విద్యా అధికారి వై.పరమేశ్వరరెడ్డి, ఏ.జి.యం.ఓ.నాయకల్లు సుంకన్న, కళాశాల ప్రిన్సిపల్ అధ్యాపకులు అబ్దుల్ కలాం చిత్ర పటానికి పూల మాల వేసి ఘనమైన నివాళులర్పించారు. దేశం గర్వించదగిన గొప్ప వ్యక్తి కలాం అని కొనియాడారు. అణు పరిశోధనలో చేసిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. లెక్చరర్లు ప్రసన్నకుమార్, రామకృష్ణ విజయ శేఖర్, మల్లికార్జున పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం: మంత్రి ఫరూక్

విశాలాంధ్ర-నంద్యాల ఆర్టీసి బస్సు ప్రయాణం సురక్షితమని, ప్రయాణికులు ఆర్టీసి బస్సుల్లో ప్రయాణం చేయాలని మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఈ సందర్భంగా నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ లో నూతన బస్సులను రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, ఆర్టీసీ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాలకు నూతనంగా ఏర్పాటు చేసిన బస్సులను అందరూ సద్వినియోగం చేసుకోవాలని, నంద్యాల జనాభా పెరగడం అదే విధంగా మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా నూతన బస్సులను కేటాయించడం, అందులో భాగంగా ఒక బస్సును శ్రీశైలం, రెండు బస్సులను హైదరాబాదుకు కేటాయిస్తూ వాటిని ప్రారంభించడం జరిగిందని, దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని, వీలైనంత వరకు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం చేయాలని కోరారు. అలాగే త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారని, ఇచ్చిన హామీని టీడీపీ ప్రభుత్వం అమలు చేయబోతోందన్నారు. ఈ కార్యక్రమంలో డిపిడిఓ రజియా సుల్తాన, డాక్టర్ బాబిన్, కౌన్సిలర్లు శ్రీదేవి, జైనాభి, ఆర్టీసీ అధికారులు , టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవరగట్టులో ప్రజలను ఆకట్టుకున్న గురవయ్య విన్యాసాలు

విశాలాంధ్ర, హొళగుంద : నెరనికి దేవరగట్టు బన్నీ ఉత్సవం సందర్భంగా మంగళవారం తెల్లవారుజామున మాల మల్లేశ్వర స్వామికి పూజారులు ప్రత్యేక పూజలు చేసి మంగళహారతి చేశారు ఉదయం సింహాసన గుడి ఆవరణముందు గోరవయ్య ఆటలు జరిగాయి. గో రవయ్యలు నల్లటి కంబళి దుస్తులు తొడిగి నెత్తిపై నల్లటి టోపీ పెట్టుకుని చేతిలో దమరుగాన్నీ వాయిస్తూ పిల్లన గోవి ఊదుతూ లయబద్ధంగా నృత్యం చేశారు. భక్తులు గోరవయ్యల ఇత్తడి ప్పులో పాలు, పండ్లు, పాయాసాన్ని వేసి తమ మొక్కుబడి తీర్చుకున్నారు. గోరవయ్యలు భక్తులకు పసుపు బండారాన్ని తలకు అంటించి ఆశీర్వదించారు పెద్ద గోర వయ్యలు చిన్న గోరవయ్యలకు దీక్షలు చేసి ఆశీర్వదించారు గోరవయ్యల ఆటలు ప్రజలకు ఆకట్టుకోవడమే కాకుండా సందడిగా మారింది గో రవయ్యలు చలకాలతో కాలికి కొట్టుకుంటూ, ఎగురుతూ భక్తి పరవశంతో తిరిగారు గోర వయ్యాల ఆటలు తిలకించడానికి భారీ సంఖ్యలో భక్తులు దేవరగట్టుకు తరలివచ్చారు భక్తులతో దేవరగట్టు కిటకిటలాడింది. గోరా వయ్యల ఆటలను తిలకించడానికి ప్రజలు బంధుమిత్రులతో వచ్చి మంటపాలు, గుడి, చత్రాల మిద్దెలపై కూర్చున్నారు. ఆట వస్తువులు అంగళ్లు, తినుబండారాలంకళ్ళు, గాజుల అంగళ్ళ వద్ద కొనుగోలుదారుల తాకిడి ఎక్కువ కనిపించింది. టెంకాయ ధరలు ఆకాశాన్నంటడంతో భక్తులు ఆందోళన చెందారు. జత టెంకాయ నూట ముప్పై రూపాయలకు కొనుగోలు చేశామని అదే బయట మార్కెట్లో టెంకాయలు తక్కువ ధరలకు లభిస్తున్నాయి భక్తులు వాపోయారు టెంకాయ లను అధిక ధరలకు అగ్ని నిలువు దోపిడీ చేశారని భక్తులు ఆరోపించారు. గో రవయ్యల ఆటలు, గొలుసు తెంపుట కార్యక్రమం, దేవదాసీల క్రీడోత్సవాలు, కంకణ విసర్జన కార్యక్రమాన్ని చూడడానికి ఉదయం నుండి భారీ సంఖ్యలో భక్తులు ద్విచక్ర వాహనాలు, భారీ వాహనాల్లో తరలివచ్చారు దేవరగట్టు పరిసర ప్రాంతాల భక్తులు ,మహిళలు, పిల్లలు కాలినడకన దేవరగట్టుకు తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు గౌరవయ్యాలపై పసుపు బండారాన్ని చల్లి మొక్కుబడి తీర్చుకున్నారు. భక్తులు స్వామి వారి పేరిట అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు గో రవయ్యల ఆటలు, గొలుసు తెంపుట కార్యక్రమంలో ఎలాంటి ఘర్షణలు జరగకుండా ఉండడానికి సిఐ శ్రీనివాసు నాయక్, ఎస్సైలు బాల నరసింహులు, చంద్ర, నరసింహులు, మహబూబ్ బాషా లతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు సీఐ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ బన్నీ ఉత్సవం సందర్భంగా ఎలాంటి ఘర్షణలు జరగకుండా భారీ పోలీస్ బందోబస్తునిర్వహించామని ప్రజలు భక్తులు పండుగను ప్రశాంతతో జరుపుకొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. పండుగలు భారీగా సెల్ ఫోన్లు, దొంగతనాలు జరిగినట్లు ప్రజలు తెలిపారు

దేవరగట్టులో జోరుగా సాగిన వ్యాపారం

విశాలాంధ, హొళగుంద: నేరనికి దేవరగట్టులో మంగళవారం గోర వయ్యల ఆటలు, గొలుసు తెంపే కార్యక్రమం స్వామివారికి కంకణా విసర్జన కార్యక్రమం జరిగింది. దేవరగట్టుకు వచ్చిన ప్రజలు గాజులు అంగళ్ల వద్ద అలాగే మిఠాయి అంగళ్ళు, తినుబండారా లంగళ్ళు, ఆటవస్తుల ఆందోళన వద్ద కొనుగోలు కోసం అధిక సంఖ్యలో గుమి గూడారు వ్యాపారం జోరుగా సాగడంతో తేరు బజార్ అంతా ట్రాఫిక్ జామ్ అయింది కొనుగోలుదారుల తాకిడి ఎక్కువ కావడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగింది. కొద్దిపాటి వర్షం పడటంతో ప్రజలు చెల్లా చదరమయ్యారు మళ్లీ వర్షం నిలబడడంతో అధిక సంఖ్యలో దేవరగట్టుకు తరలివచ్చారు. పిల్ల పాపకు ఆట వస్తువులను పిల్లల తల్లిదండ్రు లు కొనిపించారు అలాగే మహిళలు ఇంటి వస్తువులు, తమకు కావాల్సిన సామాగ్రిని వ్యాపార అంగళ్ళ వద్ద కొనుగోలు చేశారు అలాగే కుంకుమ, పసుపు బండారం, నోపి దారం, మొలతాడు దారం, విభూతి అంగళ్ల వద్ద వినియోగ దారులు అధిక సంఖ్యలో నిలబడ్డారు. వ్యాపారస్తులు అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకున్నారని ప్రజలు వాపోయారు అంగళ్లను తేరు బజార్లో దగ్గర్లో వేయడం వల్ల ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగింది. సకాలంలో వర్షాలు కొనడంతో పాటు వంటలకు గిట్టుబాటు ధర లభించడంతో ప్రజలు భక్తులు ఎంతో ఉత్సాహంతో దేవర గట్టు ఉత్సవంలో పాల్గొన్నారు

ఓర్వకల్లు మాబు సుభాని దర్గాలో గార్మి

విశాలాంధ్ర ఓర్వకల్లు .. మండల కేంద్రంలోని తోటగేరి సమీపంలో వెలసిన మాబు సుభాని దర్గాలో మంగళవారం గార్మి పండుగ మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. సాయంత్రం ఫాతిహాలు చేసి జెండాలు ఎక్కించారు. పెద్ద ఎత్తున భక్తాదులు మరియు ప్రజలు పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. అదేవిధంగా దాతల సహాయ సహకారాలతో అన్నదానం కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మెల్ల మహబూబ్ బాషా , షఫీ అల్లా షాఖాద్రి, కరీముల్లా షాఖాద్రి,రిజ్వాన్ అల్లా షాఖాద్రి ,హాసన్ ట్రైలర్ మాబాషా, కట్టుబడి మాబు మియా, అక్బర్ బాషా, మొహమ్మద్ ఖాన్,హుస్సేన్,వార్డు సభ్యులు ఇంతియాజ్, షేక్ రఫీ , జావీద్, మహబూబ్,రఫీ,సునీల్,ప్రవీణ్,మౌలాలి భక్తాదులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

టౌన్ సిఐ, ఎస్సైని కలిసిన ఈవో

విశాలాంధ్ర బనగానపల్లె: స్థానిక పోలీస్ స్టేషన్లో టౌన్ సీఐ కృష్ణయ్య యాదవ్, ఎస్సై దుగ్గిరెడ్డిని బనగానపల్లె మేజర్ గ్రామపంచాయతీ ఈవో సతీష్ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సిఐ కృష్ణయ్య యాదవ్ మాట్లాడుతూ అధికారులు సమిష్టిగా పనిచేసినప్పుడు అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కేసుల్లో పురోగతి, రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర-ఆదోని క్రైమ్: పెండింగ్ లో ఉన్న కేసుల్లో పురోగతితో పాటు, రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ పేర్కొన్నారు. మంగళవారం పెద్దతుంబళం పోలీసు స్టేషన్ లో జిల్లా ఎస్పీ వార్షిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పోలీసుస్టేషన్ ఆవరణంలో జిల్లా ఎస్పీ కొబ్బరి చెట్టు మొక్కను నాటారు. ముందుగా పోలీస్ స్టేషన్లో నమోదైన కేసుల్లో పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు తీరు వాటి పురోగతి పై కేసుల ఫైళ్ళను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ముఖ్యమైన కేసులు, పాత గ్రేవ్, ఎక్సైజ్ కేసులను సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఎక్కువగా విజిబుల్ పోలీసింగ్ చేయాలని, సమర్థవంతమైన నేర నియంత్రణ, నివారణ చర్యలు చేపట్టాలన్నారు. రౌడీ షీటర్ల కదలికలు, కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక నిగా ఉంచి చర్యలు తీసుకోవాలన్నారు. తనిఖీల్లో ఆదోని డిఎస్పీ సోమన్న, సిఐలు ప్రసాద్, గుణశేఖర్ బాబు, నల్లప్ప , పెద్దతుంబళం ఎస్సై మహేష్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై వేణుగోపాల రాజు ఉన్నారు.

ఏపీజే అబ్దుల్ కలాం సేవలు మరువలేనివి

విశాలాంధ్ర, బనగానపల్లె: పట్టణంలోని పొదుపు భవనం ఆవరణంలో స్వర్గీయ భారతరత్న, భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజేఅబ్దుల్ కలాం జయంతి సందర్భంగా వారి విగ్రహమునకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ .అడ్డాకుల శ్రీనివాస్ సీసీలు, అకౌంటెంట్, వివో ఏలు,మహిళలు పాల్గొన్నారు.

బాపనంతపురంలో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర, ఆత్మకూరు రూరల్: స్థానిక అర్బన్ రైతు సేవ కేంద్రం బాపనంతపురం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అధికారి డి.విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ అధిక వర్షాలకు ముందస్తు జాగ్రత్తగా కంది పంట కంది ప్రస్తుత మొగ్గ నుండి పూత దశలో ఉంది కాబట్టి వర్షాలు ఎక్కువై ఎక్కడైనా పొలంలో నీరు నిలబడితే పొలం గట్ల తెల్చి నీటిని బయటికి పంపాలి లేకపోతే వేరు కుళ్ళు, ఎండు తెగులు ఆశించే అవకాశం ఉంటుందని రైతులకు తెలియజేశారు. రబీలో వేసే మినుము, శనగ, పంటలపై అవగాహన కల్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో సెరికల్చర్ ఆఫీసర్ రాజశేఖర్ మరియు బహుళ ప్రయోజన విస్తరణ అధికారులు ఎన్ రవి గౌడ్, శ్రీను, మరియు కౌలు రైతు సంఘం అధ్యక్షులు తపాలా అశ్రఫ్ అలీ కృషి విజ్ఞాన పండ్ల తోట అధ్యక్షుల మహబూబ్ బాషా పాల్గొన్నారు

పంట నమోదు జాబితా ప్రదర్శన

విశాలాంధ్ర - పెద్దకడబూరు : సామాజిక తనిఖీ కోసం పంట నమోదు జాబితాను మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించినట్లు మండల వ్యవసాయ అధికారి వరప్రసాద్ తెలిపారు. రైతులందరూ వారు వేసిన పంటలు, సర్వే నెంబర్, నీటి సదుపాయం మొదలగు వివరాలు పరిశీలించుకొని ఏవైనా పొరపాట్లు ఉన్నట్లయితే ఈనెల 16లోగా రైతు సేవా కేంద్ర సిబ్బందికి తెలియ చేయాలని కోరారు. 19న తుది జాబితా తయారు చేయటం జరుగుం దన్నారు. తుది జాబితాలో ఎటువంటి మార్పులు కుదరవన్నారు.

తుఫాను హెచ్చరికలు కారణంగా రైతుల రాబోయే రెండు రోజులు జాగ్రత్త వహించాలని పంట కోతలు వాయిదా వేయాలని తెలిపారు.

భారీ వర్షం సూచనలతో జాగ్రత్తలు పాటించాలి

విశాలాంధ్ర, హొళగుంద: జిల్లాలో 16, 17 తేదీల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున రైతులు పంట రక్షణ కోసం తగిన జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి ఆనంద్ అన్నారు. పెద్ద గోనె హాల్, ఇంగళద హాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది మండల వ్యవసాధికారి ఆనంద్ లోక్ దళ్ మాట్లాడుతూ నానో యూరియా, డి ఏపి గురించి వివరించారు అలాగే భూ పరీక్ష విధానం గురించి రైతులకు అవగాహన కల్పించారు. అధిక వర్షం వల్ల ఏర్పడే తెగుళ్లు, రోగాల గురించి రైతులకు తెలిపారు కార్యక్రమంలో ఈవో విరుపాక్షి, ఎంపీఈఓ సుభాన్, నరసింహులు టిడిపి నాయకులు ప్రభాకర్ గౌడ తదితరులు పాల్గొన్నారు

గ్రామాల్లో అభివృద్ధి పనులు గుర్తించాలి

విశాలాంధ్ర. సి.బెళగల్ .. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో అభివృద్ధి పనులను గుర్తించాలని సి బెలగల్ మండల అభివృద్ధి అధికారి రాణెమ్మ అన్నారు మంగళవారం కంభదహాల్, పలుకుదొడ్డి, చింతమాను పల్లి గ్రామాలలో కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా అధికారులు ఆయా గ్రామాలలో పల్లె పండుగ గ్రామసభలు నిర్వహిం చారు. ఎంపీడీవో రాణెమ్మ మాట్లాడుతూ గ్రామాల్లో అధికారులు అభివృద్ధి పనులను గుర్తించి చేపట్టాలని అన్నారు. సీసీ రోడ్ల నిర్మాణం గోకులం షెడ్లకు భూమి పూజలు నిర్వహించారు.

అక్రమ మట్టి తవ్వకాలు నిలిపేయండి

తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి హెచ్చరిక

విశాలాంధ్ర, సి.బెళగల్. సి బెలగల్ గ్రామ సర్వే నెంబర్ 362 లో గ్రగ్రీజింగ్ గ్రౌండ్లో కొందరు అక్రమంగా ఎర్రమట్టి తవ్వకాలు జరుగుతున్నట్టు డిడి మైన్స్, కర్నూల్ వారి ద్వారా వచ్చిన సమాచారం మేరకు మంగళవారం తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఉప తహసీల్దార్ పురుషోత్తం, మండల సర్వేయర్ నాగభూషణం రెవెన్యూ సిబ్బందితో కలిసి సదరు ప్రాంతంను పరిశీలించి అక్కడ గవర్నమెంట్ భూమి నకు సంబంధించిన బోర్డు ఉన్నది, లేనిది పరిశీలించారు. అక్రమ మట్టి తవ్వకాలు నిలుపుదలకు ట్రెంచ్ ఏర్పాటు చేయాలని గ్రామ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఎవరైనా ప్రభుత్వ స్థలములో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపిన లేద ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఎటువంటి అనుమ తులు లేకుండా నివాసములు ఏర్పరచుకున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట సి.బెళగల్ వీఆర్వో వెంకటేష్, వీఆర్ఏలు తదితరులు ఉన్నారు.

రీ సర్వే సమస్యలపై సమీక్ష సమావేశం

విశాలాంధ్ర, సి.బెళగల్. మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో గతంలో జరిగిన రీ సర్వే సమస్యలపై రెవెన్యూ సిబ్బంది ఆయా గ్రామాల సర్వేయర్లతో మంగళవారం తహసిల్దార్ టి శ్రీనివాసరెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని సమస్యలను అలాగే ఇంతకు ముందు జరిగిన రీ సర్వేల సమస్యలపై అడిగి తెలుసుకున్నాడు. రెవెన్యూ సిబ్బంది సమయ పాలన పాటించి గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఉపతహసిల్దార్ పురుషోత్తం, మండల సర్వేయర్ నాగభూషణం పాల్గొన్నారు.

రెవిన్యూ సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర, హొళగుంద: మండలంలోని ప్రజలు ఎదుర్కొం టున్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని సీనియర్ మైనార్టీ టిడిపి నాయకుడు అబ్దుల్ సుభాన్ కోరారు. పత్తికొండ ఆర్డివో కార్యాలయంలో పరిపాలన అధికారిగ పనిచేసిన కే సతీష్ నూతన తాసిల్దార్ గా పదవి బాధ్యతలు చేపట్టినందుకు మంగళవారం శాలువా కప్పి ఆయనకు పూలమాలలు వేసి టిడిపి మాజీ కన్వీనర్ వీరన్న గౌడ్, టిడిపి నాయకులు మోయిన్, ఆతావుర్ రహిమాన్, జుమ్మా సలీం, జాకీర్, అల్తాఫ్, ఘనంగా సన్మానించారు. ప్రజలు ఎదుర్కొంటున్న పొలం పాస్ బుక్కులు, ఇంటి పట్టాలు, భూ సర్వేలు ఇతర రెవెన్యూ సమస్యలు ఏమైనా ఉన్నా సిబ్బంది ద్వారా ప్రజలకు అందుబాటులో ఉండి పరిష్కరించాలని కోరారు వీరి వెంట బిజెపి నాయకుడు బేనకప్ప పాల్గొన్నారు అలాగే విలేజ్ రెవెన్యూ ఉద్యోగులు బీమా, వీర నాగప్ప, రంగన్న, నరసమ్మ, అటెండర్ ఆనంద్ లు నూతన తాసిల్దార్ సతీష్ కు పూలమాలలు వేసి సన్మానించారు. వీఆర్ఏల న్యాయపరమైన సమస్య లను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని అన్నారు

సస్యరక్షణతో అధిక దిగుబడులు

వ్యవసాయ అధికారి రంగనేతాజీ

విశాలాంధ్ర -చాగలమర్రి .. సస్యరక్షణతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి రంగనేతాజీ తెలిపారు. మంగళవారం మండలంలోని నేలంపాడు, పెద్దబోధనం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రంగ నేతాజి మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులు అనుగుణంగా అధిక వర్షాల వలన వివిధ పంటలలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు.

వరి :- వర్షం ఎక్కువైతే, పొలాల్లో నీరు నిలబడకుండా బయటికి పంపాలి. వీలైనంత వరకు ఇప్పుడు పైపాటి ఎరువులు వేసుకోకూడదు, అవసరం అయితే వర్షం తగ్గిన తర్వాత పైపాటి ఎరువులు వేసుకోవాలి.

వేరుశనగ :-పంట కోతలు పూర్తి అయి ఉంటే వేరుశనగ కాయలు తడవకుండా టార్పాలిన్స్ తో కప్పి ఉంచుకోవాలి. ఒకవేళ కోతకు సిద్ధంగా ఉంటే వర్షం తగ్గిన తర్వాత కోతలు చేసుకోవాలి.

పత్తి :- పత్తి తీతలు చివరి దశలో ఉన్నాయి కాబట్టి, ఈ చివరి తీతను వాయిదా వేసుకోవాలి. లేదా త్వరగా చివరి తీత పూర్తి చేసుకొని, తీసుకొన్న పత్తి వర్షం లో తడవకుండా కాపాడుకోవాలి.

పప్పు శనగ :- వీలైనంత వరకు పప్పు శనగను వర్షాలు తగ్గిన తర్వాత విత్తుకుంటే మంచిది. పప్పు శనగ పంటను అక్టోబర్ 15 తర్వాత విట్టుకుంటే మంచిది.

కంది :- కంది ప్రస్తుతం మొగ్గ నుండి పూత దశలో ఉంది కాబట్టి, వర్షాలు ఎక్కువై ఎక్కడైనా పొలాల్లో నీరు నిలబడితే, పొలం గట్లను తెంచి నీటిని బయటికి పంపాలి. లేకపోతే వేరు కుళ్ళు, ఎండు తెగులు ఆశించే అవకాశం ఉంటుంది. తడిచిన మొక్కజొన్న ఉన్న రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాలలో తెలియపరచాలని వారి వివరాలు ప్రభుత్వానికి నివేదిక పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు,రైతులు పాల్గొన్నారు.

గోరంట్లలో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర : కోడుమూరు : మండలంలోని గోరంట్ల గ్రామంలో మండల వ్యవసాయ అధికారి ఎన్ రవిప్రకాష్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిం చారు. మంగళవారం మండల వ్యవసాయ అధికారి గోరంట్ల గ్రామ పరిధిలో రైతులతో కలిసి వారు సాగుచేసిన పంట పొలాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఏవో రవిప్రకాష్ మాట్లాడుతూ పంటలకు విచక్షణారహితంగా మందులు స్ప్రే చేయొద్దని,అలాగే రసాయనిక ఎరువులను ఎక్కువగా వాడొద్దని రైతులకు చెప్పారు.ఒకే రకం పంటలను సాగు చేయకుండా మిశ్రమ పంటలను,అంతర పంటలను సాగు చేసుకోవాల్సిందిగా రైతులకు సూచించారు.రైతులు సలహాలు సూచనల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 155251 దయల్ చేసిన ఎడల రైతులకు కావలసిన సలహాలు, సూచనలు చెప్పడమే కాకుండా,పంటలకు ఎరువులు,పురుగు మందులు ఏవిధంగా వాడాలనే దానిపైన అవగాహన కల్పిస్తారన్నారు.రబీలో వేసిన వేరుశనగ,పప్పు సెనగ విత్తనాలకి విత్తనశుద్ధి మందుతో విత్తనాలను శుద్ధి చేసుకోవాలని తెలపారు.కేజీ విత్తనానికి 3 గ్రాముల కార్బన్ డిజన్ తో విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గోరంట్ల గ్రామ వ్యవసాయశాఖ సిబ్బంది ప్రదీప్,రాజేష్,వీఆర్ఓ,గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం అడుగుజాడల్లో నడవాలి

విశాలాంధ్ర,హొళగుంద: విద్యార్థులు మాజీ రాష్ట్రపతి మిజైల్ శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాం అడుగుజాడల్లో నడవాలని హెడ్మాస్టర్ నజీర్ అహ్మద్ కోరారు. జిల్లా పరిషత్ హై స్కూల్ లో మంగళవారం అబ్దుల్ కలాం చిత్రపటానికి హెడ్మాస్టర్ ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు పేపర్ బాయ్ మొదలుకొని రాష్ట్రపతి వరకు ఎదిగిన మహా నాయకుడు అని అలాంటి నాయకుని మాటలను విద్యార్థులు ఆచరణలోకి తీసుకొని మంచి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవా లని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళి, ఫర్హద్ బేగం, తిప్పేస్వామి ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పల్లె పండుగ ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర, హొళగుంద్: మండలంలో మంగళవారం పెద్దహ్యాట, చిన్నాహ్యాట గ్రామ పంచాయతిలోపల్లె పండుగ కార్యక్రమం ఆలూరు నియోజక వర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్వీరభద్ర గౌడ్ ఆదేశాలు మేరకు పల్లె పండుగ కింద సిసి రోడ్లకు మరియు రైతు షెడ్యూలకు భూమి పూజ కార్యక్రమం జరిగింది సీనియర్ టిడిపి నాయకుడు డిఎస్ భాష మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పల్లెల్లో ప్రతి సమస్యలు తీరుస్తుంది ఉద్దేశంతోనే కార్యక్రమం ఏర్పాటు చేశారని అన్నారు మూడు గ్రామాల్లో సిసి రోడ్లు డ్రైనేజీలు మంజూరు అయ్యాయని ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి కార్యక్రమాలు ఊపొందుకుంటాయని పల్లె పండుగ ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. ఆలూరు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ వీరభద్ర గౌడ్ ఆధ్వర్యంలో మండలం తో పాటు నియోజకవర్గం అభివృద్ధి బాటలో నడుస్తుందని ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారంగా ముఖ్యమంత్రి అన్ని హామీలను నెరవేరుస్తున్నారని దీపావళిలో ఉచిత సిలిండర్ పంపిణీకి సిద్ధమయ్యారని అన్నారు జగన్ ప్రభుత్వంలో పంచాయతీలు నిర్వీర్యం అయ్యాయని అలాగే అభివృద్ధి పనులు కుంటపడినయని ఆరోపించారు మండలానికి రెండు కోట్లు నిధులు సిసి రోడ్లకు డ్రైనేజీలకు కూటమి ప్రభుత్వం విడుదల చేసిందని పేర్కొన్నారు. చంద్రబాబు పల్లె ప్రగతికి నాంది పలికారని పల్లె ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడ ని కొనియాడారు కార్యక్రమంలో ఏఈ యమునప్ప, ఎంపిడిఓ విజయ లలిత , సర్పంచ్ డిఎస్ హేసానుల్లా, ఎంపీటీసీ శివన్న,కార్యదర్శి రాజుకుమార్ ,టెక్నికల్ అసిస్టెంట్ చరణ్, అస్టిటెంట్ రవి, సీనియర్ నాయకులు డిఎస్ భాష ,సోమశేఖర గౌడ్ ,రచయ్య స్వామి ,వీరంజి ,బి.కే.వీరేష్ ,జమ్మన్న ,రాము మల్లి ,వీరభద్ర , టిడిపి నాయకులుకార్యకర్తలు పాల్గొన్నారు

టీడీపీతోనే గ్రామాలు అభివృద్ధి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : తెలుగుదేశం పార్టీతోనే గ్రామాలు అభివృద్ధి సాధ్యమని టీడీపీ యువనాయకులు రామకృష్ణారెడ్డి, రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు బసల దొడ్డి స్పష్టం చేశారు. మంగళ వారం మండల పరిధిలోని బసలదొడ్డి, నాగలాపురం, చిన్నతుంబలం గ్రామాల్లో మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణానికి టీడీపీ యువనాయకులు రామకృష్ణారెడ్డి, టిడిపి రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, మండల అధ్యక్షులు బసలదొడ్డి ఈరన్న భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల అభివృద్ధికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా బసలదొడ్డి గ్రామంలో రూ. 15 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు నిర్మిస్తామని వెల్లడించారు. అలాగే నాగలాపురం, చిన్నతుంబలం గ్రామాలలో రూ. 10 లక్షల చొప్పున సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేసినట్లు పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని గాలికి వదిలేస్తే కూడమి ప్రభుత్వం గ్రామాభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. రాబోయే ఐదేళ్లలో కూటమి ప్రభుత్వంతో గ్రామాలకు మహర్దశ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనాథ్, ఎంపీడీఓ జయరాముడు, పంచాయతీ రాజ్ ఏఈ ఖాదర్ బాషా, ఏపీఎం శ్రీనివాసులు, ఏపీఓ ఖాదర్ బాషా, ఐసీడీఎస్ సూపర్ వైజర్ విజయకుమారి, టీడీపీ నాయకులు వీరేష్ గౌడ్, శివ, నర్సింహులు, ఏక్ హనుమంతు, చంద్రశేఖర్, మహాదేవ, చంద్ర, తిక్కయ్య, బద్రి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమంతో గ్రామాలలో పండుగ వాతావరణం నెలకొందని టిడిపి నాయకుడు వల్లంపాడు సర్పంచ్ జగదీశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కోవెలకుంట్ల మండల పరిధిలోని వల్లంపాడు, బిజినవేముల, వెలగటూరు గ్రామాలలో మండల ప్రత్యేక అధికారి సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పల్లె పండుగ కార్యక్రమంలో టిడిపి నాయకులు అమ్మడాల మద్దిలేటి భాగంగా సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. రాష్ట్రంలో ఎన్నడు లేని విధంగా కూటమి ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమం తీసుకుని వచ్చి గ్రామాల అభివృద్ధి కృషి చేయడం చాలా సంతోషకరమైన విషయమని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వరప్రసాద్, ఈఓఆర్డి ప్రకాష్ నాయుడు, ఏపీఓ శ్రీవిద్య, వెంకటేశ్వర్ రెడ్డి, జి ఉషెనయ్య, ధనుంజయుడు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికే పల్లె పండుగ

ఎంపీడీఓ మంజులవాణి

విశాలాంధ్ర-చాగలమర్రి + గ్రామాలను అభివృద్ధి బాట పట్టించడానికే పల్లె పండుగ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మంజులవాణి అన్నారు. మంగళవారం మండలంలోని శెట్టివీడు,గొడెగనూరు,కొత్తపల్లె,వనిపెంట గ్రామాల్లో రూ 49లక్షల ఉపాధి నిధులతో చేపట్టనున్న సిమెంటు రోడ్లు,డ్రైనేజ్ నిర్మాణపనులను సర్పంచ్లు లక్ష్మిదేవి,సంజీవరాయుడు, ఎంపీడీఓలు ప్రారంభించారు.కార్యక్రమంలో ఈఓపి ఆర్డి తాహీర్‌హుసేన్,పిఆ ఏఈ కొండారెడ్డి, ఏపిఓ నిర్మల,టిడిపి నాయకులు నరసింహారెడ్డి, శేఖర్‌రెడ్డి, సూర్యనారాయణ, ప్రమోద్,పెద్ద ఈశ్వర రెడ్డి, సురేష్ కుమార్‌రెడ్డి, పెద్దపుల్లారెడ్డి, శివారెడ్డి, విక్రం, జున్ను నర్సిరెడ్డి,గోపాల్, బాలనర సింహుడు, బాబునాయుడు, సుబ్బనరసింహుడు, పాములేటి, పంచాయితీ కారదర్శులు ఆదినారాయణ, రాజశేఖర్, ఫైరోజ్, వీఆర్ఓలు, సచివాలయాల సిబ్బంది, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం..

పుచ్చకాయలపల్లెలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సర్పంచ్

విశాలాంధ్ర- ఉయ్యాలవాడ: గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి పథంలో నడిపేందుకే ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. మంగళవారం మండలంలోని పుచ్చకాయలపల్లె, బోడెమ్మనూరు గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ. 20 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మధుసూదనాదేవి, పిఆర్ ఏఈ వెంకటయ్య, ఏపీవో రవి ప్రకాష్, ఈవోపీఆర్డి వెంకటేశ్వరరావు, నాయకులు నరేంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.